సాగులో పెట్టుబడుల మోత

- వర్షాలతో జోరుగా వ్యవసాయ పనులు
- గతేడాది కంటే రెండింతలు పెరిగిన ఖర్చులు
- రుణాలు ఇవ్వడానికి నసేమిరా అంటున్న బ్యాంకర్లు
- రైతుబంధు కోసం రైతుల ఎదురుచూపు
- పట్టించుకోని అధికారులు



పొలం దున్నుతున్న రైతు (ఫైల్)

యాచారం: వర్షాలు కురుస్తున్న దృష్ట్యా వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. పక్షం రోజుల కింద కురిసిన వర్షాలకు తమ వ్యవసాయ పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు ప్రస్తుతం కురిసిన వర్షాలతో విత్తనాలు వేస్తున్నారు. ఈ వానాకాలం కింద మండలంలోని 24 గ్రామాల్లో దాదాపు 25 వేల ఎకరాలకు పైగా వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచానా. సాగును బట్టి విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచారు. గతేడాది వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటల్లో నీళ్లు లేవు. బోరుబావుల్లో ఉన్న భూగర్భజలాలు కూడా అడుగంటిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ వానాకాలం కింద రైతులు వరి పంట సాగు చేయడం కోసం ఆలోచనలో పడ్డారు. రోహిణి, భరిణి కార్తెల్లో వరి నార్లు పోస్తే మంచి దిగుబడి వస్తుందని రైతుల్లో నమ్మకం. కాని వరి పోస్తే వర్షాలు కురియకపోతే సాగుకు కష్టం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు మెట్ట పంటల సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. యాచారం, నక్కర్త మేడిపల్లి, నానక్‌నగర్, చింతుల్ల, నందివనపర్తి, చౌదర్‌పల్లి, గునుగల్, మొండిగౌరెల్లి, చింతపట్ల, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో జొన్న, కందులు, పెసర్లు, సజ్జలు తదితర రకాల మెట్ట మంటలు సాగు చేస్తున్నారు. అయా గ్రామాల్లో అత్యధికంగా పత్తి విత్తనాలను విత్తుతున్నారు. వర్షాలు కురిస్తే భూగర్భజలాలు పెరుగుతాయోనని ఆశతో రైతులు ఎండిపోయిన బోరుబావులను మరమ్మతులు చేయించుకుంటున్నారు.

పెరిగిన సాగు ఖర్చులు..

వ్యవసాయ పనులు జోరందుకోవడంతో సాగు ఖర్చులు రెండింతలు పెరిగాయి. గ్రామాల్లో అత్యధికంగా రైతులు ట్రాక్టర్ల ద్వారానే పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. గతేడాది ట్రాక్టర్ ద్వారా వ్యవసాయ పొలాన్ని దున్నితే గంటకు రూ. 700 తీసుకునే వారు. ఈ ఏడాది మాత్రం రూ. 1,200లకు పైగానే తీసుకుంటున్నారు. సాగు పనులు జోరందుకోవడంతో ట్రాక్టర్ల యజమానులకు రైతులు రూ. వేలాది అడ్వాన్స్‌లు ఇచ్చి బ్రతిమిలాడే పరిస్థితి ఉంది. డిమాండ్‌ను బట్టి ట్రాక్టర్ల డ్రైవర్లు పగలుతో పాటు రాత్రిల్లు కూడా వ్యవసాయ పొలాలను దున్నుతున్నారు. ట్రాక్టర్ల అద్దెలు ఇలా ఉంటే అరక దున్నె నాగళ్లకు కూడ భలే డిమాండ్ పెరిగింది. పశువుల నాగళ్ల ద్వారా విత్తనాలేస్తే రోజుకు గతేడాది రూ. 1,500 తీసుకుంటే ప్రస్తుతం రూ.2,500 వసూల్ చేస్తున్నారు. ఈ కూలీల ఖర్చయితే చెప్పనవసమే లేదు. గతేడాది రోజుకు రూ. 300 కూలీ ఉంటే ఈ ఏడాది రూ. 600 దాటింది. విత్తనాలు పెట్టే అదును పోతుందనే భయంతో రైతులు ఒక్కో గ్రామంలో కూలీలకు నిత్యం రూ.700లకు పైనే ఇస్తున్నారు. సాగు డిమాండ్‌ను బట్టి అయా గ్రామాల్లో కూలీ రేట్లు పెంచుతున్నారు.

అప్పులు చేసి..

వ్యవసాయ పనుల కోసం రైతులు అప్పులు చేస్తున్నారు. మెట్ట పంటల సాగుకు కూడా ఎకరాకు రూ. 20 వేలకు పైగానే ఖర్చవుతుంది. పత్తి పంట సాగు చేస్తే ఎకరాకు విత్తనాలు, ఎరువులు, దున్నడం ఖర్చు, కూలీల ఖర్చు ఇలా మొత్తం కలిపి రూ. 30 వేలకు పైగా దాటుతుంది. మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు సాధారణంగా ఎకరా నుంచి 20 ఎకరాలకు పైగా పంటల సాగుచేస్తున్నారు. అంటే ఒక్కో రైతు సాగు ఖర్చుల కోసం దాదాపు రూ. 50 వేల నుంచి రూ.రెండున్నర లక్షలకు పైగా ఖర్చు చేస్తారు. గతేడాది వర్షాలు లేకపోవడంతో మెట్ట పంటలతో పాటు వరి పంట కూడా ఎండిపోయింది. దీంతో రైతులకు లాభాలు దేవుడుడెరుగు సాగు ఖర్చులు కూడా మిగిలలేదు. ప్రస్తుతమున్న రేవంత్‌రెడ్డి సర్కార్ నేటికి రైతుబంధు నిధులు జమ చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో 16,210 మంది రైతులు రైతుబంధుకు అర్హులుగా ఉన్నారు. గత యాసంగి సీజన్‌లో 16,210 మంది రైతులకు రూ. 21 కోట్ల రైతుబంధు నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. రైతుబంధు నిధులు జమ కాకపోవడం, బ్యాంకర్లు కూడా కొత్త పంట రుణాలు ఇవ్వడం లేదు.

డీజిల్ ధరలు పెరగడంతో..



డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టర్ల అద్దె చార్జీలు పెంచక తప్పడం లేదు. గతేడాది ట్రాక్టర్ గంట పొలాన్ని దున్నితే రూ. 650 తీసుకునేవాళ్లం. ప్రస్తుతం గంటకు రూ. వెయ్యికి పైగానే వసూల్ చేస్తున్నాం. ఒక్కో గ్రామంలో ఒక్కో ధర అమలవుతుంది. రైతులు ముందే అడ్వాన్స్‌లు ఇస్తేనే ట్రాక్టర్లు పంపే పరిస్థితి ఉంది.

– సంగెం రవి, ట్రాక్టర్ యజమాని, మొండిగౌరెల్లి

ఎనిమిది ఎకరాల్లో వరి పంట నష్టపోయాం..



కరువు పరిస్థితుల వల్ల యాసంగిలో 8 ఎకరాల వరి పంటవేసి పూర్తిగా నష్టపోయామని రైతు ఆవేదన వ్యకం చేంశారు. దాదాపు రూ. రెండున్నర లక్షల పెట్టుబడి ఖర్చులు అప్పులైనాయి. ప్రస్తుతం పంటల సాగుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. పంటలు సాగు చేయాలంటే పెరిగిన సాగు ఖర్చులు ఆందోళన కలిగిస్తున్నాయి. సర్కార్ వెంటనే రుణమాఫీ చేస్తే బ్యాంకులకు వెళ్లి కొత్త రుణాలు తెచ్చుకుంటాం. రైతుబంధును వెంటనే జమ చేయాలి.

– దెంది రాంరెడ్డి,(రైతు) తమ్మలోనిగూడ

క్లుప్తంగా

భక్తులతో కిటకిటలాడిన మైసిగండి ఆలయం



మైసిగండిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్: కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో మైసమ్మ దేవతను ఆదివారం భక్తులు వేలాదిగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. బుధవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో మైసిగండి ఆలయ పరిసరాలు భక్త జనంతో నిండిపోయింది. క్యూలైన్లలో గంటల తరబడి వేచి అమ్మవారిని దర్శించుకున్నారు.

సన్నాయి, డోలు అందజేత



సన్నాయి, డోలు అందజేస్తున్న శంకర్, తదితరులు

తలకొండపల్లి: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో రూ.85వేలు విరాళం సేకరించి నాయి బ్రాహ్మణులకు సన్నాయి, డోలు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా దాతలచే విరాళాలు సేకరించారన్నారు. దీంతో ఆదివారం పులిమామిడి సీతారాంరెడ్డి, జనార్దన్‌రెడ్డి, కమలాకర్‌లు అందజేసిన రూ.85వేలతో శంకర్ ఆధ్వర్యంలో దేవుని పడకల్ శ్రీ వెంకటేశ్వర ఆలయంలో నాయి బ్రాహ్మణులకు సన్నాయి, డోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రామాచారి, మధుసూదన్ రెడి, జంగయ్య, రమేష్, వేణు, మహేశ్, మాజీ సర్పంచ్ కుమ్మరి శంకర్, స్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం కేటాయించాలి

ఉద్యమ కారుల ఫోరం మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగయ్య గౌడ్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

తుర్కయంజాల్: సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వెంటనే 250 గజాల ఇంటి స్థలాన్ని ఉద్యమకారులకు కేటాయించాలని ఉద్యమ కారుల ఫోరం మున్సిపాలిటీ అధ్యక్షుడు నక్క జంగయ్య గౌడ్ కోరారు. ఆదివారం తుర్కయంజాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఉద్యమ కారులకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకూ పోరాటం చేస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం ప్రకాశ్, విక్రం రెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి



ఆదిబట్లలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రతిఒక్కరూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఆదిబట్ల టౌన్‌లో బడిబాట నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం విద్యా విధానంలో నూతన మార్పులు తీసుకొస్తుందని తెలిపారు. అందులో భాగంగానే అమ్మ ఆదర్శ పాఠశాలలను తీసుకొచ్చి అభివృద్ధి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోరే కళమ్మ, కోఆప్షన్ సభ్యులు గోపాల్‌గౌడ్, పెద్దలు పాండు రంగారెడ్డి, రాజు, పాఠశాల చైర్మన్ మమత, ప్రధానోపాధ్యాయులు వర్కాల పరమేష్, ఉపాధ్యాయులు బుచ్చయ్య, రామ్మోహన్, జంగయ్య, విజయలక్ష్మి, బబ్లీ, ఇందిరా, ఎస్ఎస్‌జీ సభ్యులు మాధురి, అంగన్‌వాడీ టీచర్ బేబీ, సూజాత తదితరులు పాల్గొన్నారు .

ప్రశాంతంగా గ్రూప్‌-1 ప్రిలిమ్స్

- సెయింట్ కళాశాల వద్ద ఆలస్యంగా పరీక్షకు హాజరు
- కంట తడి పెట్టిన అభ్యర్థులు



ఆలస్యంగా రావడంతో కంటతడి పెట్టిన మహిళ

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రూఫ్‌–1 పరీక్ష ఇబ్రహీంపట్నంలో ప్రశాంతంగా జరిగింది. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీల్లో కలిపి 20 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 13వేల మంది అభ్యర్థులు పరీక్ష రాయడానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో కలిపి 2,900 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్, సెయింట్, ఎంఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల వద్ద అభ్యర్థులు ఆలస్యంగా వచ్చారు. సెయింట్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఐదుగురు, చిలుకూరుకు చెందిన ఓ మహిళా ఐదు నిమిషాలు ఆలస్యంగా రావడంతో పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో కంటతడి పెట్టింది.



సెయింట్ కళాశాల వద్ద పరీక్షకేంద్రంలోకి పంపించాలని వేడుకుంటున్న అభ్యర్థులు

జూన్ రెండోవారంలో పూరీ జగన్నాథ్ రథయాత్ర

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో జూన్ రెండోవారంలో పూరీ జగన్నాథ్ రథయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో ఆదివారం పూరీ జగన్నాథ్ రథయాత్ర నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షుడు మహర్షింగ్ ప్రభు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూకట్‌పల్లి ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలో పూరీ జగన్నాథ్ రథ యాత్ర నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు మహర్షింగ్ ప్రభు వివరించారు. రథయాత్ర నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. రథయాత్రలో పెద్ద ఎత్తున భక్తులు, ప్రజలు పాల్గొనేలా చూడాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మహర్షింగ్ ప్రభును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాపిశెట్టి రాము, వీరబొమ్మ రామ్మోహన్, ఎంగలి బాలకృష్ణ, శ్రీశైలం, నర్సింహా, నటరాజు యాదయ్య, దొంతు విశ్వనాదం, అల్లాజీ తదితరులు పాల్గొన్నారు.



మహర్షింగ్ ప్రభును సత్కరిస్తున్న స్థానికులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఇబ్రహీంపట్నం రూరల్: 1993-94 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: యాచారం మండలం చిన్నతుండ్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 1993–94 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఇబ్రహీంపట్నంలో జరిగింది. చిన్ననాటి విద్యాబుద్ధులు చెప్పిన గురువులను పూలమాలలు వేసి శాలువ కప్పి సత్కరించారు. పూర్వ విద్యార్థులందరూ గురువుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 30 ఏళ్ల అనంతరం వారంతా ఒకే వేదిక్పై దర్శనమివ్వడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. జక్కుల వెంకటేశ్, అంకని ఈశ్వర్, బి.వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రాజేష్, రాజిరెడ్డి, యశోద, ప్రతిభ, పాల్గొన్నారు.

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్ 45 మంది పూర్వ విద్యార్థులు మండలంలోని ఓ పంక్షన్ హాల్లో సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి తరలి వచ్చారు. ఒకరినొకరు చేయిచేయి కలుపుకుంటూ ఆప్యాయంగా పలుకరించుకున్నారు. తమ కుటుంబ సభ్యులను పరిచయం చేస్తూ, తాము చేసే వృత్తి పనులను గూర్చి తెలుసుకున్నారు. ఆనాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా, సరిత, చెన్నయ్య, ప్రసన్న, మహేందర్, శ్రీలత, శివశంకర్, శేఖర్, గీత, రజిత, పాల్గొన్నారు.

యాచారం: మండల కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. యాచారం ఉన్నత పాఠశాలకు చెందిన 2001–02 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ఏ. కృష్ణ, కృష్ణయ్య, నారాయణరెడ్డి, సత్యం, రమేష్, చంద్రమౌళి, వెంకటలక్ష్మీ, పద్మతో పాటు పూర్వ విద్యార్థులు మారోజ్ ప్రదీప్‌చారి పాల్గొన్నారు.

ఆమనగల్లు: పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 30 ఏళ్లక్రితం చదువుకున్న స్నేహితులంతా ఒక్కచోట కలుసుకుని ఆత్మీయంగా గడిపారు. ఆమనగల్లు పట్టణంలోని వెంకటనర్సింహా గార్డెన్స్‌లో ఆమనగల్లు బాలుర ఉన్నత పాఠశాలలో 1994–95 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 30 ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితులంతా ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 42 సార్లు రక్తదానం చేసిన ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థి సిరందాస్ జగదీశ్వర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి ఒక మొక్కను బహుకరించి ఇంటి ఆవరణలో నాటుకుని సంరక్షించాలని సూచించారు. హుజుర్‌నగర్ సీఐ గజ్జె చరమందరాజు, స్నేహహస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పెరికేటి యాదయ్య, ఉపాధ్యక్షుడు సింగంపల్లి శ్రీను, కోశాధికారి యాదయ్య, సభ్యులు వెంకటేశ్, జహంగీర్, ఆనంద్ పాల్గొన్నారు.



ఆమనగల్లు: 1994-95 బ్యాచ్ విద్యార్థులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎస్టీ కేటగిరీలో విద్యార్థి ప్రతిభ

జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించిన లోకేశ్

కడ్తాల్: జాతీయ స్థాయిలో ఐఐటీల్లో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో మండల కేంద్రానికి చెందిన ఎస్ లోకేశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఆదివారం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయి ఎస్టీ కేటగిరిలో 27వ ర్యాంకు సాధించాడు. లోకేశ్ తండ్రి భీముడునాయక్ ముద్విన్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా తల్లి అలివేలు గృహిణి. జాతీయ స్థాయి ఎస్టీ కేటగిరిలో లోకేశ్ 27వ ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. లోకేశ్ 1నుంచి 10వ తరగతి వరకు కడ్తాల్‌లోని ప్రగతి ఉన్నత పాఠశాలలో చదివి, ఎస్ఎస్‌సీలో 9.8 జీపీఏ సాధించాడని, ఇంటర్మీడియట్ నారాయణ కళాశాలలో చదివి, ఇంటర్‌లో 948 మార్కులు సాధించాడని తెలిపారు. కాగ ఐఐటీలో సీటు సాధించాలనే లక్ష్యం తనకు చిన్నప్పటి నుంచి ఉందని లోకేశ్ తెలిపారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో ఎస్టీ కేటగిరిలో 27వ ర్యాంకు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశాడు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

మంచాల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మంచాల మండలంలోని అంబోత్ తండాలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో పండుగలు జరుపుకోవాలన్నారు.

మొండిగౌరెల్లిలో బీజేపీ శ్రేణుల సంబరాలు

యాచారం: కేంద్రంలో నరేంద్రమోదీ వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు ఆదివారం రాత్రి మొండిగౌరెల్లి గ్రామంలో బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో బొడ్రాయి యూత్ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలోనే దేశం సురక్షితంగా, అభివృద్ధి చెందుతుందనే భరోసాతోనే ప్రజలు మూడోసారి అవకాశం కల్పించారని రవీందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల యాదగిరిరెడ్డి, సీనియర్ నాయకులు కొలన్ మల్లారెడ్డి, మర్పల్లి మల్లేష్ యాదవ్, కుంచారం సందీప్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కృష్ణయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: భారత ప్రధానిగా నరేంద్రమోదీ వరుసగా మూడో సారి ప్రమాణస్వీకారం చేయడంతో ఆదివారం బీజేపీ నేతలు సంబురాలు జరుపుకున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, కవాడిపల్లిలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొడిగె సురేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నేతలు బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, జంగమయ్య, పాపయ్య, రమాదేవి, సురేఖా, శ్రీలత, యాదగిరి, రామకృష్ణ, కట్టా సాయి, శ్రావణ్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



మిఠాయిలు పంచుకుంటున్న పార్టీ నాయకులు



అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్‌లో వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. 40 రోజులుగా విద్యార్థులకు ప్రాచీన విద్య కర్రసాముతో పాటు కబడ్డీ, కరాటే వంటి క్రీడల్లో శిక్షణ ఇచ్చారు. కోచ్‌లు పోలోజు ప్రశాంత్, సంపత్‌గౌడ్, పవన్, రోహిత్, నర్సింహులు విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

బస్‌పాస్ కౌంటర్ ఎత్తివేత

- పాస్‌ల కోసం కల్వకుర్తి వెళ్లాల్సిందే
- ఆదాయం లేదని తీసేసిన ఆర్టీసీ అధికారులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న బస్‌పాస్ కౌంటర్‌ను మూడు రోజుల క్రితం ఆర్టీసీ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా మూసివేశారు. దీంతో బస్‌పాస్‌ల కోసం విద్యార్థులు, ఉద్యోగులు, దివ్యాంగులు హైదరాబాద్ లేదా కల్వకుర్తి పట్టణాలకు వెళ్లాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 20 ఏళ్లుగా ఆమనగల్లులో ఉన్న బస్‌పాస్ కౌంటర్‌ను ఆదాయం లేదని సాకుతో ఆర్టీసీ అధికారులు ఎత్తేసినట్లు తెలుస్తుంది.

అందరికీ అనుకూలం

ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న బస్‌పాస్ కౌంటర్ అందరికీ అనుకూలంగా ఉండేది. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ విద్యార్థులకు, ఉద్యోగులకు, దివ్యాంగులకు ఆమనగల్లులో బస్‌పాస్ కౌంటర్ ఉండటంతో పాస్‌లు తీసుకోవడానికి వీలుగా ఉండేది. ఆమనగల్లు బస్టాండ్‌లో దాదాపు ఇరవై ఏళ్లక్రితం కల్వకుర్తి ఆర్టీసీడిపో అధికారులు ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్‌లో ప్రతినెలా విద్యార్థులు, ఉద్యోగులు బస్‌పాస్‌లు తీసుకునేవారు.



ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్

లాభాలు తగ్గడంతో..

ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్‌ను ఆదాయం రావడం లేదనే కారణంతో మూడు రోజుల క్రితం మూసివేశారు. బస్‌పాస్ కౌంటర్‌లో పనిచేస్తున్న కల్వకుర్తి ఆర్టీసీడిపో ఉద్యోగిని తిరిగి కల్వకుర్తిలో పనిచేయాల్సిందిగా అధికారులు ఆదేశించారు. ఆమనగల్లు ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్ ద్వారా గతంలో ప్రతినెలా దాదాపు రూ.4 లక్షల దాకా ఆదాయం వచ్చేది. కరోనా అనంతరం ఆదాయం కొద్దిగా తగ్గినా అధికారులు బస్‌పాస్ కౌంటర్‌ను కొనసాగించారు. కాగా ఇటీవల మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించడంతో విద్యార్థినుల బస్‌పాస్‌ల ఆదాయం తగ్గిపోయింది. దీంతో బస్‌పాస్ కౌంటర్ ద్వారా రూ.లక్ష కూడా రాకపోవడంతో ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు బస్‌పాస్ కౌంటర్‌ను మూసివేశారు.

తప్పని తిప్పలు...

ఆమనగల్లు ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్‌ను మూసివేయడంతో విద్యార్థులు ఇబ్బందులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల విద్యార్థులు, ఉద్యోగులు బస్‌పాస్ కోసం కల్వకుర్తికి వెళ్లాల్సి వస్తుంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందరికీ అనుకూలంగా ఉన్న బస్‌పాస్ కౌంటర్‌ను మూసివేసి ఇబ్బందులు కలిగిస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మూసివేసిన బస్‌పాస్ కౌంటర్‌ను తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారు. ఈ విషయంపై కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిణిని వివరణ కోరగా ఆమనగల్లులోని బస్‌పాస్ కౌంటర్‌ను తీసివేశామని కానీ వారానికి ఒకరోజు బస్‌పాస్ కౌంటర్‌ను తెరిచి ఉంచుతామని తెలిపారు.